ప్రజాశక్తి
శనివారం 16 డిసెంబరు 2023
5
శ్రీకాకుళం

శాశ్వత లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

శ్రీకాకుళం : సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి రూపాయి ఖర్చు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం కోసం శాశ్వత లోక్ అదాలత్ దోహదపడుతుందని జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు అన్నారు. నగరంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ప్రజా ప్రయోజిత సేవలపై శుక్రవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. శాశ్వత లోక్ అదాలత్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. ప్రజా ప్రయోజిత సేవల్లో లోపం, పరిహారం కోసం దావా, సొమ్ము వసూలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ కె.మురళీధర్, ఎఒ కె.సత్యనారాయణ, అధ్యాపకులు ముకుందరావు, ఆర్.కృష్ణ, బి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తత

- 185 మంది ఆశావర్కర్ల అరెస్టు, విడుదల
- ముగిసిన 36 గంటల ధర్నా

ఆశా కార్యకర్తను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కనీస వేతనాలు చెల్లించాలని, పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఆశావర్కర్లు చేపట్టిన 36 గంటల ధర్నా శుక్రవారంతో ముగిసింది. ఆందోళనలో భాగంగా చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు నుంచి కలెక్టరేట్‌కు ఆశావర్కర్లు ర్యాలీగా బయలుదేరారు. పెద్దసంఖ్యలో హాజరైన ఆశాలు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. వారికి సంఘీభావం తెలిపేందుకు సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు చేరుకున్నారు. వారందరూ కలెక్టరేట్‌కు వెళ్తుండగా వాంబే కాలనీ వద్ద ఒకటో పట్టణ సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐ బి.గణేష్ నేతృత్వాన మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, ఆశావర్కర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులను ప్రతిఘటిస్తూ ఆశావర్కర్లు, సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు ముందుకు దూసుకెళ్లడంతో స్వల్ప తోపులాటతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు పి.తేజేశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతితో పాటు 185 మందిని పోలీసులు బలవంతంగా తీసుకెళ్లి వాహనాల్లోకి ఎక్కించారు. వారిని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి అన్నారు. ఆశావర్కర్లకు కనీస వేతనాలు, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యాన్ని తొలగించి, ప్రభుత్వమే నియామకాలు చేపట్టాలన్నారు. రిటైర్మెంట్ కాలాన్ని 62 ఏళ్లకు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు వచ్చే వరకు పనిచేయించుకుని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించకుండానే తొలగించడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లకు సంబంధం లేని పనులు చేయించడం ఆపాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల పోరాటానికి ఐద్వా నాయకులు పి.శ్రీదేవి, బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు వెంకటరావు పాణిగ్రాహి, పోస్టల్ ఎంప్లాయీస్ నాయకులు కె.చంద్రశేఖర్, నాగార్జున అగ్రికెమ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వై.గోపాలుడు, ఎ.అశోక్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు పి.జయలక్ష్మి, సిహెచ్.లక్ష్మి పి.జయలక్ష్మి, పి.దమయంతి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అమరజీవి పొట్టి శ్రీరాములు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. పొట్టి శ్రీరాములు 71వ వర్థంతి సందర్భంగా కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహనీయుడు అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎస్‌పి జి.ఆర్ రాధిక పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు వై.శృతి, సిహెచ్.జి.వి ప్రసాదరావు, బి..విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల స్పందనకు నాలుగు వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగుల సమస్యలపై కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు వినతులను స్వీకరించారు. ప్రతి నెలా నిర్వహించే ఉద్యోగుల స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో వచ్చిన అర్జీలను ప్రభుత్వానికి పంపుతామన్నారు.

రాజకీయాలను భ్రష్టు పట్టించారు

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వ్యక్తిగత దూషణలతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజకీయాలను భ్రష్టు పట్టించారని జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిపి చంద్రమోహన్ విమర్శించారు. శ్రీకాకుళం నగరంలోని ఒక హోటల్‌లో శుక్రవారం సమన్వయకర్తల సమావేశం అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాసలో ప్రజల సొమ్ముతో సభ నిర్వహించి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత దూషణలకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిలను తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. బిసిలకు 56 కార్పొరేషన్లు, డైరెక్టర్ పదవులను ఇచ్చి కార్పొరేషన్లకు విధివిధానాలు లేకుండా చేశారని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని చెప్పారు. ఉద్యోగుల పిఆర్‌సి పెద్ద బూటకమని, వారికి సకాలంలో వేతనాలూ ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రభుత్వంపై అన్ని తరగతుల ప్రజలూ ఆగ్రహంతో ఉన్నారని, జగన్‌ను జనమే తరిమికొడతారని తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పది అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానాన్ని టిడిపి, జనసేన కూటమి గెలుచుకుంటుందని చెప్పారు. సమావేశంలో జనసేన శ్రీకాకుళం నియోజకవర్గ నాయకులు పి.సురేష్‌బాబు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే ఉద్దానానికి మేలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఉద్దాన ప్రాంతానికి మేలు చేకూరిందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి హయాంలో ఉద్దానం ప్రాంతానికి ఇంటింటికీ 20 లీటర్ల మంచినీటిని రూ.రెండు అందించామన్నారు. కిడ్నీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్, సుజధారతో కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కిడ్నీ వ్యాధుల బారిన ఎందుకు పడుతున్నారో నాలుగున్నరేళ్ల కాలంలో నిపుణులతో సర్వే చేయించారా అని ప్రశ్నించారు. నాడు రూ.600 కోట్లు మంజూరు చేసి ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నుంచి ఉద్దానం ప్రాంతానికి నీటిని అందించాలన్న ప్రతిపాదనలను ఎందుకు రద్దు చేశారో చెప్పాలన్నారు. వంశధార రిజర్వాయర్ డెడ్ స్టోరేజ్ నుంచి నీరు ఎలా మళ్లిస్తారని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షులు బొనిగి భాస్కరరావు, నాయకులు ప్రధాన విజయరాం, ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ మాదిగ, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టిక్కెట్ ఎవరికి ఇచ్చినా పనిచేస్తాం

- మా కుటుంబ విషయాలు పట్టించుకోవద్దు
- అందరూ సమన్వయంతో పనిచేయాలి
- స్పష్టం చేసిన దువ్వాడ దంపతులు

మాట్లాడుతున్న వెంకటరెడ్డి పక్కన శ్రీనివాస్, వాణి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి టిక్కెట్‌ను ఎవరికి ఇచ్చినా పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలిలోని ఆదిత్య కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన టెక్కలి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ విషయాలు తమ వ్యక్తిగతమని, వాటిని పక్కనపెట్టి విజయం కోసం సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి డుమ్మా కొట్టడం సరికాదన్నారు. నియోజవర్గంలో ఇప్పటివరకు కార్యకర్తలు నిరాశగా ఉన్న మాట వాస్తవమేనని, ఇకపై వారిలో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేస్తామని చెప్పారు. జగనన్న అధికారంలో ఉంటేనే మనం అధికారంలో ఉంటామని, లేదంటే ప్రతిపక్షం వాళ్లకి అవకాశం ఇచ్చినట్లు అవుతామని హితబోధ చేశారు. టెక్కలి నియోజవర్గంలో మూలపేట పోర్టు సుమారు రూ.నాలుగు వేల కోట్లతో నిర్మాణం జరుగుతోందని, మరో ఆరు నెలల్లో ప్రారంభించడానికి జగన్ వస్తారని తెలిపారు. అప్పటికి ఈ నియోజకవర్గాన్ని కానుకగా ఇవ్వాలన్నారు. నియోజకవర్గ టిడిపి నేతలు 40 ఏళ్లుగా పదవుల్లో ఉంటూ జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. తన 18 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ కింజరాపు కుటుంబంతో పోరాటం చేస్తున్నానని తెలిపారు. తన వ్యాపారం జీవితంపై మర్డర్ కేసులు పెట్టి అణచివేతకు గురిచేశారని, అటువంటి వారిని ఎట్టి పరిస్థితులలోనైనా ఓడించి తీరుతానన్నారు.

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి మాట్లాడుతూ పార్టీ పరువును బజారుకు ఈడ్చకుండా కార్యకర్తలు పార్టీపై దృష్టిసారించాలని సూచించారు. కొంతమంది కార్యకర్తలు వాళ్ల స్వార్థం కోసం పని కట్టుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అటువంటి వాళ్లను క్షమించబోమన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు కాయల వెంకటరెడ్డి, ఎంపిపి ఎ.సరోజనమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, బాడాన మురళి, కెల్లి జగన్నాయకులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి నాయకుల గైర్హాజరు

సమావేశానికి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు గణపతి, జెడ్‌పిటిసిలు భార్గవి, పాల వసంతరెడ్డి, దుబ్బ వెంకటరావు, ఎంపిపిలు ఎన్.శ్రీరామ్మూర్తి, మేరుగ రాజేశ్వరి, రోణంకి ఉమామల్లేశ్వరరావు, మూడు మండలాల ఎంపిటిసిలు, సర్పంచ్‌లు గైర్హాజరయ్యారు. వీరిలో అధికశాతం మంది ఎమ్మెల్యే టిక్కెట్ ఆశిస్తున్న పేరాడ తిలక్ అనుయాయులు.

ఎసిబికి చిక్కిన సచివాలయ ఉద్యోగి

రూ.ఐదు వేలు లంచంతో పట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంలోని గొంటివీధి సచివాలయానికి చెందిన వార్డు సెక్రటరీ జయకృష్ణ బాలాజీ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం కోసం రూ.ఐదు వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం పట్టుబడ్డాడు. ఎసిబి డిఎస్‌పి బి.వి.వి రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... గొంటివీధి సచివాలయ పరిధిలో నివాసం ఉంటున్న రిటైర్డు ఎక్సైజ్ కానిస్టేబుల్ మహమ్మద్ ఖాన్ గత నెల ఏడో తేదీన మృతి చెందాడు. మరణ ధ్రువీకరణ పత్రం వచ్చాక కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రానికి ఆయన కుమారుడు వలీఖాన్ సచివాలయంలో దరఖాస్తు చేశాడు. సర్టిఫికేట్ ఎంక్వైరీకి వచ్చిన జయకృష్ణ బాలాజీ ధ్రువీకరణ పత్రం కావాలంటే తనకు రూ.ఆరు వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.ఐదు వేలు ఇచ్చేందుకు ఖాన్ కుటుంబ సభ్యులు అంగీకరించి, ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం జయకృష్ణ బాలాజీ వలీఖాన్‌కు ఫోన్ చేసి ధ్రువీకరణ పత్రం సిద్ధంగా ఉందని, డబ్బులు పట్టుకుని రావాలన్నారు. ఎసిబి అధికారుల సూచన మేరకు సచివాలయానికి వెళ్లిన వలీఖాన్ నుంచి జయకృష్ణ బాలాజీ రూ.ఐదు వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి నేతృత్వాన సిఐలు భాస్కర్, హరి, రమణ దాడి చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. బాలాజీని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

ఇంధన పొదుపుపై అవగాహన అవసరం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంధన పొదుపు ప్రజల్లో అవగాహన కల్పించి వృథా కాకుండా చూడాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యాన జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను జిల్లాపరిషత్ సమావేశ మందిరం వద్ద శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా అవుతుందన్నారు. ఇంధన పరిరక్షణకు ఎల్‌ఇడి బల్బులు, ఎక్కువ స్టార్‌లున్న గృహోపకరణాల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్‌ను పొదుపు చేద్దాం- ధనం ఆదా చేద్దాం, సేవ్ పవర్ సేవ్ నేషన్ తదితర నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఇంధన పొదుపుపై కార్యక్రమంలో పాల్గొన్న వారితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇపిడిసిఎల్ ఎస్‌ఇ ఎన్.కృష్ణమూర్తి, ఇఇలు ఎస్.బయ్యన్నాయుడు, ఎల్.సిహెచ్ పాత్రుడు, ఎస్ఎఒపి తాతాచార్యులు, డిఇలు, ఎఇలు, సిబ్బంది, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సాగు పద్ధతులు

ఎన్‌జిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ ఆర్.శారద జయలక్ష్మి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మార్కెట్ డిమాండ్, రైతుల అవసరాలకు అనుగుణంగా నూతన వ్యవసాయ పద్ధతులను రూపొందించాలని ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఎఎన్‌జిఆర్ఎయు) వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి అన్నారు. శ్రీకాకుళం మండలం నైర వ్యవసాయ కళాశాలలో 'ఆహార భద్రత, సుస్థిర గ్రామీణ జీవనోపాధికి వ్యవసాయ ఆవిష్కరణలు' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు తొలిరోజు శుక్రవారం ఆమె ప్రారంభోపన్యాసం చేశారు. వాతావరణంలో మార్పులు, చీడపీడల యాజమాన్యం, నిర్దిష్ట వ్యవసాయం అంశాలతో పాటు కోవిడ్ అనంతర పరిణామాలను దృష్టిలో పెట్టుకుని రైతుల లాభార్జన దిశగా పయనించే విధానాలను తయారు చేయాలని సూచించారు. కటక్‌లోని ఎన్‌ఆర్ఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎ.కె నాయక్ 'సుస్థిర వ్యవసాయానికి కర్బన రహిత వరి సాగు' అంశంపై అవగాహన కల్పించారు. బెంగుళూరుకు చెందిన జికెవికె ఆచార్యులు డాక్టర్ ఎం.ఎస్ శేషసాయి 'వరి ఉత్పాదకతను పెంచేందుకు అనువైన వృక్షశాస్త్ర బ్రీడింగ్ వ్యూహాలు'పై అవగాహన కల్పించారు. న్యూఢిల్లీలోని ఐఎఆర్ఐ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఎస్ బ్రహ్మానంద్ 'ఆహార భద్రతకు వినూత్న పర్యావరణ అనుకూలమైన నీటి యాజమాన్యంలో సాంకేతిక పద్ధతులపై ప్రసంగించారు ఎఎన్‌జిఆర్ఎయు బోర్డు ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.వి ఉమామహేష్ సదస్సు ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా 17 రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు రాసిన అంశాలతో కూడిన సావనీర్‌ను వక్తలు ఆవిష్కరించారు. నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నైర కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సునంద, జి.ఎస్ రాయ్, కె.హేమలతతో పాటు పలువురు శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా పాల్గొనగా, కొంతమంది ఆన్‌లైన్‌లో భాగస్వామ్యమయ్యారు.

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ ఛాన్సలర్ శారద జయలక్ష్మి తదితరులు

మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన మున్సిపల్ ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాల డిమాండ్ చేశారు. సర్వీస్ రూల్స్ రూపొందించాలని, ఉన్నత పాఠశాలలోని అన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. ధర్నాలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి పిసూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

నిరవధిక సమ్మె ఉధృతం

- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం
- సమ్మెకు పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఉధృతమవుతోంది. సమ్మెకు పలు పార్టీలు, ఉద్యోగ, ప్రజాసంఘాల నుంచి మద్దతు పెరుగుతోంది. సమ్మెలో భాగంగా నాలుగో రోజు శుక్రవారం మానవహారాలు నిర్వహించి, తహశీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు. న్యాయమైన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. అందుకు భిన్నంగా కవ్వింపు చర్యలకు పాల్పడుతూ అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టించడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం సరికాదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

శ్రీకాకుళం నగరంలోని అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి తోటవీధి కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, సిఐటియు నాయకులు ఎ.సత్యం తదితరులు పాల్గొన్నారు. గార ప్రాజెక్ట కార్యాలయం నుంచి మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నల్లరిబ్బన్లతో నిరసన తెలిపి మానవహారం చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.సింహాచలం సంఘీభావం తెలిపారు.

బూర్జలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మద్దతు తెలిపారు. అంగన్వాడీలతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ కనీస వేతనం చెల్లించకుండా వారి జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు.

కోటబొమ్మాళిలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు నాయకులు హెచ్.ఈశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు జి.నారాయణరావు తదితరులు సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, సిఐటియు సీనియర్ నాయకులు భవిరి కృష్ణమూర్తి, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు సంఘీబావం తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు, తహశీల్దార్ కార్యాలయం మీదుగా ఐసిడిఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఆమదాలవలస : అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న రవికుమార్

కొత్తూరు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డిటి ఎన్.సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సిర్ల ప్రసాద్, అంగన్వాడీ సంఘ నాయకులు సుదీష్ణ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

పొందూరు తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల అధ్యక్షులు బి.జ్యోతిలక్ష్మి, కె.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

పలాసలో సమ్మెకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, యుటిఎఫ్ నాయకులు బి.ఓంకార్, కె.రమేష్ తదితరులు సంఘీభావం తెలిపారు. టెక్కలిలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నల్లదుస్తులు ధరించి నిరసన తెలిపారు. టిడిపి నాయకులు పి.అజయ్ కుమార్, బి.శేషగిరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి ఎల్లయ్య మద్దతు తెలిపారు. ఇచ్ఛాపురం తహశీల్దార్ కార్యాయం వద్ద నినాదాలు చేస్తూ డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరికి వినతిపత్రం అందించారు.

శ్రీకాకుళం అర్బన్ : మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీలు

పొందూరు : లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

వైసిపి హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- పొందూరు

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధిని సాధించిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం బురిడికంచరాం గ్రామంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామంలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి గంట్యాడ రమేష్, ఎంపిటిసి బొత్స రమణ, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, స్థానిక నాయకులు పిన్నింటి అప్పలనాయుడు, పీర్ సాహెబ్, వాళ్ల రమణ, వండాన సాయి, వాళ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

సరుబుజ్జిలి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం మండలంలో కొండవలస గ్రామంలో రూ.80 లక్షలతో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి తాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలు పొందిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు కెవివి.సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, లావేటి అనిల్ కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నదాతల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని సిఎం జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందించినట్టు వైసిపి సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ అన్నారు. శుక్రవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ జిల్లాలోని పలాస కిడ్నీ రీసెర్చ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి వచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డిని గాంధీ కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. బూర్జ మండలం పరిధిలో డొంకలపర్త, లక్కుపురం, అల్లెన, కిలంతరి, వావాం, కాఖండ్యాం, మామిడి వలస, గుత్తావల్లి వరకు ప్రవహిస్తున్న నాగవళి నది నీరువలన వర్షాకాలంలో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని, దీనివలన ప్రతి సంవత్సరం రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గడచిన ప్రభుత్వాలు సమస్యను పట్టించుకోలేదని అన్నదాతల కష్టాలను దృష్టిలో పెట్టుకొని డొంకలపర్త నుండి గుత్తావల్లి వరకు నదిని అనుసరించి రక్షణ గోడను నిర్మించాలని వినతిపత్రం అందించగా సిఎం సానుకూలంగా స్పందించినట్లు గాంధీ తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

2024 గెలుపే లక్ష్యంగా వైసిపి సోషల్ మీడియా సభ్యులు సైనికులవలే పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపు నిచ్చారు. స్థానిక శ్రీ కళ్యాణ వెంకటేశ్వర వేదిక కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సోషల్ మీడియా సభ్యులతో ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. ప్రతిపక్షాలు చేసే బూటకపు ప్రచారాలను, ఎల్లో మీడియా చేస్తున్న అడ్డగోలు ప్రచారాలను సోషల్ మీడియా ద్వారా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో వైసిపి ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు, కో-కన్వీనర్లు, నాలుగు మండలాల సోషల్ మీడియా కన్వీనర్లు, కోకన్వీనర్లు, గ్రామ సచివాలయ సోషల్ మీడియా కన్వీనర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

డోల జగన్‌తో ధర్మాన కృష్ణచైతన్య తదితరులు

బిసి సెల్ ఉపాధ్యక్షునిగా డోల జగన్

ప్రజాశక్తి- పోలాకి

డోల గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు డోల జగన్‌కు వైసిపి బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమించబడిన సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం డోల గ్రామంలో రాష్ట్ర బిసిసెల్ జోనల్ ఇన్‌ఛార్జి ధర్మాన కృష్ణదాస్ తనయుడు ధర్మాన కృష్ణ చైతన్య మర్యాద పూర్వకంగా కలిసారు. ఆయనను సాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, జెసిఎస్ కన్వీనర్ కణితి సత్తిబాబు, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్, ఎస్ఎల్ పురం సర్పంచ్ ప్రతినిధి యారబాటి వెంకటరమణ, ఆర్.త్రినాథరావు, చింతాడ ఉమా, సర్పంచ్‌లు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నళినిని అభినందిస్తున్న డైరెక్టర్ వెంకట గోపాల ధన బాలాజీ తదితరులు

జాతీయస్థాయిలో గుర్తింపు తేవాలి

ఎచ్చెర్ల: జాతీయస్థాయిలో యూనివర్సిటీ గుర్తింపు తీసుకురావాలని ఐఐఐటి డైరెక్టర్ వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ విద్యార్థిని నళిని నేషనల్ యోగాకు ఎంపికైన సందర్భంగా ఆయన అభినందించారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విజయం సాధించిన ఐఐఐటి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్ బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ కోర్లమోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ సల్లా ఆసిరినాయుడు, యోగా విభాగపతి డాక్టర్ ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, ధనంజయరావు వెల్ఫేర్ డీన్ గేదెల రవి, అధ్యాపకులు, పిఆర్ఓ మామిడి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగాంలో అంబేద్కర్ స్మృతివనం

నందిగాం: నందిగాంలో బజాజ్ జంక్షన్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనానికి భూమి పూజను ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి, సర్పంచ్ జడ్యాడ జయరాం ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మాజీ డిప్యూటీ కలెక్టర్ వరభూషణరావు, అక్కురాడ లోకనాథం, అంబోడి విష్ణు పాల్గొన్నారు

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి తీరని లోటు

ప్రజాశక్తి- టెక్కలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతిపై టెక్కలి మండల యుటిఎఫ్ నాయకులు శుక్రవారం నివాళ్లర్పించారు. టీచర్ ఎమ్మెల్సీగా కొనసాగుతున్న షేక్ బాబ్జి మృతి తీరని లోటన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కురుమాన దాలయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు పడాల గణపతి, తమ్మినేని వైకుంఠరావు, సీనియర్ నాయకులు పాలవలస ధర్మారావు, మారం కుమారస్వామి, విజయ్ కుమార్, పొట్నూరు జగదీష్, వైకుంఠరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నందిగాం: ఉద్యోగులు, పెన్షనర్ల పక్షాన నిరంతరం పోరాటం చేసిన మహోన్నతమైన వ్యక్తి పిడిఎఫ్ యోధుడు షేక్ షాబ్‌జి అని విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు వైకుంఠరావు అన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేస్తూ ఉద్యోగులు, పెన్షనర్ల తరపున నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి అని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో ప్రధాన కార్యదర్శి జి.విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.శ్రీరామ్, కె.వి.సుబ్రహ్మణ్యం, ఎస్‌వికె రాజారావు, ఎం.రాము, సిహెచ్ సూరి, సత్యం, ఆర్‌వి రమణ ఉన్నారు.

పలాస: టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటని యుటిఎఫ్ నాయకులు బి.ఓంకార్, మధుసూదనరావు అన్నారు. చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమణ, కంచరాన రమేష్, కృష్ణారావు, గోపి, పాపారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు సంతాపం తెలిపారు.

కంచిలి: ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మరణం ప్రజా ఉద్యమాలకు, హక్కుల పోరాటాలకు తీరనిలోటని యుటిఎఫ్ శాఖ ప్రతినిధులు అన్నారు. యుటిఎఫ్ కార్యాలయం వద్ద నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సీనియర్ కామ్రేడ్ వెంకటరావు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబెర్ సుదర్శన్ బెహరా, మండల ప్రధాన కార్యదర్శి నల్లన రవి, అధ్యక్షులు మురళి నాయకో, కోశాధికారి త్రినాథ్, పైల పురుషోత్తం రెడ్డి, దుర్గాప్రసాద్ పాడి పాల్గొన్నారు.

కంచిలి : సాబ్జీ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాలి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రేమ లీల ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఎంపిపి, జెడ్‌పిటిసి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరుకావాలని ఆమె కోరారు. మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

మాతాశిశు సంరక్షణ శిక్షణ

ప్రజాశక్తి- పలాస

హైదరాబాద్ అరబిందో కార్యాలయంలో ఈ నెల 7 నుంచి 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం అరబిందో అత్యవసర మెడికల్ సర్వీసస్ 108 సౌజన్యంతో లండన్‌కు చెందిన సాంకేతిక భాగస్వామ్యులు వైద్య బృందంతో 108 సంస్థలో పని చేసే వోజెటిలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. మాత శిశువు సంరక్షణ కీలక సమయంలో సహాయ పడడంలో అంబులెన్సులో పనిచేసే ఇఎంటిలకు డాక్టర్ సునీల్‌బాబు, పరుశురాం, మహిపాల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 16 మంది వోజీటిలు హాజరు కాగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి కోటబొమ్మాళి నుంచి నెయ్యిల కృష్ణారావు శిక్షణకు హాజరయ్యారు.

ఆర్‌టిసి కండక్టర్‌కు చేయూత

ప్రజాశక్తి- సోంపేట

విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కాళ్లు పోగొట్టుకొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సోంపేటకు చెందిన ఆర్‌టిసి కండక్టర్ కతంబాల మోహనరావుకు సిఎం జగన్మోహన్ రెడ్డి తన అపన్నహస్తాన్ని అందించారు. విధులు నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకొని వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న మోహనరావు మకరం పురంలో ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రయత్నించారు. అయితే అధికారులు అనుమతించకపోవడంతో అక్కడి నుంచి తన భార్య సహాయంతో పలాస చేరుకున్నారు. పలాస సిఎంరాగానే ఆయన కలిసేదుకు మోహనరావు ప్రయత్నించడంతో పోలీసులు గమనించి ఆయనను ముందు వరసలో పెట్టారు. దీనిని గమనించిన సిఎం జగన్మోహన్ రెడ్డి తన కాన్వాయ్ వద్దకు మోహనరావును రప్పించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. శాఖాపరమైన సహాయం లేకపోయినప్పటికీ వైద్యం కోసం అప్పులు చేశానని తెలుపగా మోహనరావు వైద్యానికి పూర్తి ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని భరోసా ఇచ్చారు. దీనికి మోహనరావు దంపతులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. మోహనరావును ఆదుకున్న ముఖ్యమంత్రిని సొండి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీ విశ్వనాథ చౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డెప్రా రాజారావు, రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావులు కృతజ్ఞతలు తెలియజేశారు.

మాట్లాడుతున్న జెసి నవీన్

గమ్యాన్ని నిర్దేశించుకుని చదవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, హరిక కన్‌స్ట్రక్షన్ అండ్ కన్సల్టెంట్స్ అధినేత హరిక ప్రసాద్ పాల్గొన్నారు. హరిక ప్రసాద్ మాట్లాడుతూ ప్రతివిద్యార్థి భవిష్యత్తులో ఏంకావాలని అనుకుంటున్నారో ఆ గమ్యాన్ని నిర్దేశించుకుని చదవాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థి ఎస్.సంజయ్ కార్తీక్ ఆంగ్లంలో రచించిన కవితా సంపుటి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రభ, కరస్పాండెంట్ సిస్టర్ అరులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్టులు ఎంతగానో ఆకర్షించాయి.

న్యాయసేవలపై అవగాహన అవసరం

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు న్యాయ సేవలపై అవగాహన అవగహన కలిగి న్యాయ విద్యలో అవకాశాలు అందిపుచ్చుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు సూచించారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశా లో స్టూడెంట్ ప్రోగ్రెషన్ సెల్, జిల్లా న్యాయ సాధికార సంస్థ సంయుక్తంగా లా ఎడ్యుకేషన్ కెరీర్ ఆపర్చునిటీస్" అనే అంశంపై విద్యార్థులకు అవగాహనా కారక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వై.పోలినాయుడు, స్టూడెంట్ ప్రోగ్రెషన్ సెల్ కోఆర్డినేటర్ వై.వంశీకుమార్, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఆర్.హరిత, రవికుమార్ పాల్గొన్నారు.

సామాజిక భవనానికి భూమిపూజ

ఇచ్ఛాపురం: మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ సూచించారు. శుక్రవారం కొఠారి గ్రామ పంచాయతీలో జిల్లా పరిషత్, 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి మంజూరైన రూ.5 లక్షలతో ఎస్‌సి కమ్యూనిటీ భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్ ప్రతినిధి దుక్క ఆనంద్, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, నర్తు ప్రసాద్, ఉప్పాడ రాజారెడ్డి, రాంపత్ని చిట్టిబాబు, నర్తు భాను, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న జెడ్‌పిటిసి నారాయణమ్మ

న్యాయవాదుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు కోరుతూ స్థానిక ఐఎఎల్ యూనిట్, ఇచ్ఛాపురం న్యాయవాదుల సంఘం సంయుక్తంగా రెండవరోజు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించాయి. ఐఎఎల్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు నాగరాజ్ పాత్రో సమన్వయంతో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.దేవరాజు సమక్షంలో మానవహక్కుల కౌన్సిల్ నియోజకవర్గ అధ్యక్షులు దక్కత కృష్ణమూర్తి సహకారంతో పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. భూముల హక్కులు నిర్ణయించే అధికారాలు రెవిన్యూ శాఖ, ట్రిబ్యునల్స్ నిర్ధారించే అధికారాలు కల్పిస్తూ జిఒ నెం 512 ద్వారా తీసుకొచ్చిన చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని, ప్రజలకు తీవ్ర అసౌకర్యం అధిక వ్యయం కలిగించే చట్టం సరికాదని నినాదాలు చేస్తూ పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కోర్టుల పరిధి నుంచి భూమి హక్కులు నిర్ధారించే బాధ్యతలు తప్పిస్తే పేద బడుగు వర్గాల ప్రజలు రైతులు నష్టాలు చవి చూడాల్సి వస్తుందని నాగరాజ్ పాత్రో అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.ఎల్. నారాయణ, ఎన్.రమణయ్య, ఎం.రాంబాబు, ఎస్‌విఎస్ రంగారావు, బచ్చు జగ్గారావు, కె ప్రసాద్, భగవాన్ దాస్, ప్రహ్లద్, ఎం కె సామంత్, బి సూర్యనారాయణ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

నిరసన తెలుపుతున్న బెంతుఒరియాలు

మాట ఇచ్చి మడమ తిప్పారు

కవిటి: బెంతు ఒరియా కులస్తులకు సిఎం జగన్మోహన్ రెడ్డి మాటిచ్చి మడమతిప్పారని బెంతు ఒరియా యూత్ అధ్యక్షుడు సుమన్ బిసాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా బెంతు ఒరియాల కోసం పోరాడుతున్న తమకు గురువారం పలాస వచ్చిన సిఎం తీపి కబురు అందిస్తారని ఆశించామని, కనీసం తమ సమస్యను ప్రస్తావించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బెంతు ఒరియా యువతీ, యువకులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. బెంతు ఒరియాలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు, ప్రభుత్వ యంత్రాంగం అంటూ నినాదాలు చేశారు. అనంతరం సుమన్ బిసాయి మాట్లాడుతూ 2023లో పలాస సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి బెంతు ఒరియాలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ తరువాత విశ్రాంత ఐఎఎస్ జెసి శర్మతో కూడిన ఏకసభ్య కమిషన్ వేస్తూ జిఒ 104 విడుదల చేశారని, మళ్లీ 52 జిఒ జారీచేస్తూ విశ్రాంత ఐఎఎస్ శ్యాముల్ ఆనంద్ వన్ మ్యాన్ కమిషన్ వేసినట్టు తెలిపారు. వాటివల్ల ఇంతవరకు తమకు ఒరిగింది ఏదీ లేదన్నారు. ఇప్పటికైనా తమ సమస్యను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో మేగానధ్ బిసాయి, దుదిస్టి మజ్జి, బృందావన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించి, మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. మండలం లండారిపుట్టుగ సచివాలయం పరిధిలో శుక్రవారం రాత్రి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి పంచాయతీలో అమలు చేసిన సంక్షేమ పథకాల చార్ట్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అవినీతి రహితంగా సంక్షేమ పథకాల అమలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, దానికి ఆర్థిక సాయం ప్రస్తుత ప్రభుత్వంలోనే సాధ్యమైందని, అందుకే మళ్లీ జగనే అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి నర్తు చామంతి, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, ఎఎంసి చైర్మన్ బాబురావు, కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వర రెడ్డి, సర్పంచ్ లచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి మన్మధరావు, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పలాస: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని పరిపాలన వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసి చూపిస్తున్నారని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. మండలంలో రెంటికోట గ్రామంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో మంజూరు చేసిన పథకాలు, నిధుల వివరాల ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠ రావు, సర్పంచ్ శాసనపురి తిరుమలరావు, మండల సచివాలయం కన్వీనర్ దువ్వాడ రవి కుమార్, పంచాయితీ కార్యదర్శి సద్గుణ బాబు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: సచివాలయాల ద్వారా ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు అందించే ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే చెల్లుతుందని టెక్కలి వైసిపి ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి అన్నారు. శుక్రవారం ఉమిలాడలో సర్పంచ్ కెల్లి లక్ష్మి అధ్యక్షతన ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం, పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి దువ్వాడ వాణి హాజరయ్యారు. ముందుగా జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, డైరెక్టర్ మార్పు నాగభూషణరావు, వైసిపి నాయకులు కోత సతీష్, ఎన్ని మన్మథరావు, నక్కిట్ల నరేష్, ఉప్పాడ లోకనాథం, కొడ దామోదర్, అడ్ల అప్పారావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : జెండాను ఆవిష్కరిస్తున్న దువ్వాడ వాణి

కరువుపై సిఎం ఎందుకు నోరు విప్పలేదు

ప్రజాశక్తి- పలాస

సకాలంలో వర్షాలు కురవక సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, జిల్లాను కరువు జిల్లాగా పరకటించకుండా జీడికి గిట్టుబాటు ధరపై సిఎం జగన్మోహన్ రెడ్డి ఎందుకు నోరు విప్పలేదని సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు బి. వాసుదేవరావు ప్రశ్నించారు. పలాసలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకోవడమే తప్ప రైతుల గోడును ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ఈ ఏడాది వరిపంట పూర్తిగా నాశనమైందని, పంటకు పెట్టిన పెట్టుబడులు వస్తాయో లేదో తెలియని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. జీడిపిక్కలు ధర తగ్గిపోవడంతో జీడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తిత్లీ తుపాను పరిహారం రెట్టింపు చేస్తామని చెప్పి సుమారు 7 వేల మంది నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నరన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా తయారైందన్నారు. ఉద్దాన ప్రాంతంలో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ ఏ సమస్యపై మాట్లాడకుండా సిఎం వెళ్ళిపోవడం దారుణమన్నారు. అఖిల భారత కిసాన్ మహాసభ నాయకులు వి.అప్పయ్య, సిపిఎం నాయకులు ఎన్.మోహనారావు, రైతుసంఘం జిల్లా నాయకులు బి.రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆనందరావు

ముగింపు సభ విజయవంతం చేయాలి

కవిటి: విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లిలో భూమాత లేవుట్‌లో జరగనున్న యువగళం పాదయాత్ర ముగింపు సభలో టిడిపి శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని సభ విజయవంతం చేయాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ పిలుపునిచ్చారు. మండలం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు సృష్టించినా లోకేష్ పాదయాత్ర కొనసాగించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. మరో ఐదు నెలల్లో టిడిపి - జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని ఎమ్మెల్యే అశోక్ జోస్యం చెప్పారు. సమావేశంలో నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, నాలుగు మండలాల టిడిపి శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

పాతపట్నం: యువగళం పాదయాత్ర ముగింపు సభ విజయవంతం చేయాలని టిడిపి సీనియర్ నాయకులు, ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సభ, ఎన్నికల శంఖారావం సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పైల బాబ్జి, యాళ్ళ నాగేశ్వరరావు, వెలమల గోవిందరావు, ఎద్దు దాసునాయుడు, కె.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

మందస మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాఘవ పాణిగ్రహి (60) తన ద్విచక్ర వాహన టైరు పంచర్ కావడంతో కాలినడకన తోసుకుంటూ జాతీయ రహదారిపై వస్తుండగా బిన్నల మదనాపురం గ్రామ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద గుండెపోటుతో ఒక్కసారిగా రహదారిపై కుప్పకూలి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది చేరుకున్నప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. అనంతరం మృతుని కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

కన్యకా పరమేశ్వరి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో లక్ష్మీనగర్ వీధిలో ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వేకువజామున చోరీ జరిగింది. గుడివెనుక వైపు ఉన్న గోడపై నుంచి దూకి తాళాలను పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గుడిలో ఉన్న తులం బంగారం, ఐదు కేజీల వెండి, హుండీలో ఉన్న సుమారు రూ.30 వేలు నగదు చోరీకి గురైనట్లు ఆలయ అర్చకుడు బలివాడ మృత్యుంజయ శాస్త్రి తెలిపారు. చోరీకి గురైన విషయాన్ని తెలుసుకొని పోలీస్ క్లూస్ టీం అక్కడకు చేరుకొని ఆలయాన్ని పరిశీలించారు. గురువారం ఆలయంలో రాత్రి కాపలాదారుగా పనిచేస్తున్న బొబ్బిలి రామారావు అనారోగ్యం కారణంగా విధులకు హాజరు కాలేదు. దేవాలయం ధర్మకర్త తమ్మన రామకృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వై. కృష్ణ తెలిపారు. గత కొంత కాలంగా పట్టణంలో వరుసగా మెయిన్ రోడ్డుపై దుకాణాల్లో దొంగతనాలు, గేటు, సొట్టవానిపేటలోని దేవాలయాలు, బైకులు, ఇళ్లలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

బాధితులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్

8 మందికి సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

పలు అనారోగ్య కారణాలతో వైద్య సాయం కోసం ఎదురుచూస్తున్న 8మందికి సిఎం రిలీఫ్ కింద రూ.తొమ్మిది లక్షల సాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సాయాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ బాధితులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి.ప్రకాశరావు, కొవ్వాడ ఎస్‌డిసి తహశీల్దార్ బి.వి రమణ, డి-సెక్షన్ సూపరింటెండెంట్ పి.అమల, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చేనేత కార్పొరేషన్ ఉపాధ్యక్షులుగా లీలారాణి

ప్రజాశక్తి- సోంపేట

లీలారాణి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత కార్పొరేషన్‌కు ఉపాధ్యక్షురాలుగా స్థానిక ఎంపిటిసి నిమ్మన లీలారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నియామక పత్రాలు అందినట్లు ఆమె శుక్రవారం విలేకరులకు తెలిపారు. తనకు బాధ్యతను అప్పగించిన సిఎం జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక వైసిపి నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

రేపు పెన్షనర్ల సమావేశం

ప్రజాశక్తి- పలాస

అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 17న కాశీబుగ్గ శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు తమ్మినాన మాధవరావు, కార్యదర్శి ఎన్.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఫెన్షన్‌దారుల సమస్యలు చర్చిస్తామని తెలిపారు. సమావేశానికి ఫెన్షన్‌దారులు విజయవంతం చేయాలని కోరారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

పొందూరు: మండలం తోలాపి గ్రామంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన పప్పల నాగేశ్వరరావు, అన్నపూర్ణ దంపతులు సహకారంతో శుక్రవారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన సుమారు 150 మంది నిరుపేదలకు దుప్పట్లు, బొంతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోయన నర్సింహమూర్తి, సత్యసాయి సేవామందిరం కన్వీనర్, సేవాదల్ సభ్యులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్ ఎంపికపై హర్షం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం



విజయ్‌కుమార్

రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీగా ప్రత్తి విజయ్‌కుమార్‌ను రాష్ట్ర వైసిపి కేంద్ర పార్టీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడుగా ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడుగా, స్టేట్ ఫాస్టర్ ఫెల్లో షిప్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయకుమార్‌ను వైసిపి అధిష్టానం రాష్ట్రస్థాయి క్రిస్టియన్ మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమించింది. తనకు నియమించినందుకు సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, జిల్లాపార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ రామారావు, వైసిపి ఇన్‌ఛార్జి పిరియ సాయిరాజ్‌కు కృత్ణతలు తెలిపారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

రణస్థలం రూరల్: మండలంలో బంటుపల్లిలో అనారోగ్యంతో మరణించిన శీల మాలచ్చి భార్య నారాయణమ్మకు వైఎస్ఆర్ బీమా నగదు రూ.10 వేలు సర్పంచ్ నడుకుదిటి రజని శుక్రవారం అందజేసారు. ఎంపిటిసి టి.సంజీవరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ రామారావు, బిజెపి మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు గురాల కరుణ, సీల రమేష్ పాల్గొన్నారు.

పలాస విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పలాస

కంచిలి మండలం ఎపి.మోడల్ స్కూల్ ఎంఎస్.పల్లిలో ఈనెల 9 నుంచి 12 వరకు జరిగిన బాలబాలికల ఆటల పోటీల్లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటుకున్నారు. జూనియర్ బాలురు విభాగంలో కె.జయంత్, కె.గంగాధర్, ఎమ్.ఉమామహేష్ ప్రథమస్థానం, బాలికల విభాగంలో ఇ.ఝాన్సీ 1500 మీటర్ల పరుగులో తృతీయ స్థానం, టెన్నికాయిట్‌లో ఎన్.దివ్య, డి.రమ్య, వై.మాధవి ప్రథమ స్థానం, సీనియర్ బాలురు విభాగం టెన్నికాయిట్‌లో బి.సిద్ధార్థ, టి.గణేష్, టి.వెంకటేష్ ప్రథమస్థానం, బాడ్మింటైన్‌లో మహమ్మద్ రెహాన్ ఖాన్, ఆర్.చరణ్ కుమార్, కె.ఆశిష్ ద్వితీయ స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో జె.ప్రవీణ్ తృతీయ స్థానం, బాలికల విభాగంలో టెన్నికాయిట్‌లో జె.భవాని, పి.శ్రావణి, బి.నందిని ప్రథమ స్థానం, బాడ్మింటైన్‌లో రష్మిత పండా, ఎస్.శిరీష, పి.షర్మిళ ద్వితీయస్థానం సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావులకు, విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వైసిపి నేతలకు జగన్ కరచాలనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కంచిలి మండలం పలాసలో గురువారం పర్యటించిన సిఎం జగన్ మోహన్ రెడ్డితో పలువురు వైసిపి నాయకులకు కరచాలనం లభించింది. మొదటిసారిగా అనేకమంది నాయకులకు సిఎంతో కలిసేందుకు పూర్తిస్థాయి అవకాశం లభించడంతో సర్వత్రా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి సిఎం పర్యటనలో జిల్లాకు సంబంధించి నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లు ఖరారు అవుతుందని భావించారు. ఎక్కడా కూడా రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ప్రకటన చెయ్యకపోవడం నిరాశ వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రధానంగా ఇచ్ఛాపురం అభ్యర్థి పేరు ప్రకటన చేస్తారని ఎదురు చూశారు. కానీ ఎక్కడ ప్రత్యక్షంగాగాని పరోక్షంగా కూడా అభ్యర్థి పేరు బయటకు రాలేదని పార్టీవర్గాలు అంటున్నాయి. జగన్ మోహన్ రెడ్డికి కలసిన వారిలో. సీడ్ ఎపి చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి, చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్‌లు లాభాల స్వర్ణమణి, భారతి దివ్య, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ బాబురావు, పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, ఎపిఎసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్, చాట్ల తులసీదాస్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి

బాలికా చట్టాలపై విద్యార్థులు అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని బాలికల రక్షణ యూనిట్ నిర్వాహకులు ధర్మాన సీతారామారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం బాలికల చట్టాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యవివాహాలు నిరోధానికి సహకరించాలని, గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఉమెన్ ఎంపవర్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్ కుమార్, ఉమెన్ ఎంపవర్మెంట్ సభ్యులు లీలా పద్మజ, బాలికల హెల్ప్‌లైన్ నిర్వాహకులు అప్పలనాయుడు, స్థానిక కమ్యూనిటీ అధికారి జోగిదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రికి శంకుస్థాపన చేసింది చంద్రబాబు

ప్రజాశక్తి- పలాస

కిడ్నీ వ్యాధిపై పరిశోధన చేసేందుకు, కిడ్నీ రోగులకు ఆదుకొనేందుకు ముందుగా కిడ్నీ ఆస్పత్రికి శంకుస్థాపన చేసింది టిడిపి అధినేత చంద్రబాబు నాయుడేనని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కిడ్నీ ఆస్పత్రి ప్రారంభించారుగాని కిడ్నీవ్యాధి ఎలా వ్యాపిస్తుందనే మూలాలు కొనుక్కోవాలని తెలిపారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్, మందస మండల అధ్యక్షులు భావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, జనసేన అధ్యక్షులు కుప్పాయి గోపాలరావు, బమ్మిడి కర్రయ్య పాల్గొన్నారు.

నంది అవార్డుకు ధనుంజయ్ రెడ్డి ఎంపిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం టి.బరంపురం గ్రామానికి చెందిన జానపద కళాకారుడు, కోలాటం పాండురంగ భజన హార్మోనియం, కీబోర్డ్‌లో ప్రతిభ కలిగిన ఆల్ ఇండియా కళా రంగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ తిప్పన ధనుంజయ రెడ్డికి హైదరాబాద్ కల్చరల్ మెగా ఎంటర్ ప్రైజస్ ఆల్ క్యాటగిరి నంది అవార్డు కన్సిలేషన్స్ అవార్డు సీజన్ నెంబర్-2 ఆధ్వర్యంలో నంది అవార్డుకు ఎంపికైనట్లు తెలియజేశారు. ఈ అవార్డు ప్రధానం 17న హైదరాబాద్‌లో బిర్లా ఆడిటోరియంలో ప్రముఖుల చేతుల మీదుగా అందించబోతునట్లు తెలియజేశారు. నంది అవార్డు ఎంపిక పట్ల ఎంపిపి బోర పుష్ప, మాజీ ఎంపిపి కారింగి మోహనరావు, సర్పంచ్ కారింగి త్రినాథ్ రెడ్డి, వైసిపి అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్, రంగాల జానకిరామ్ రెడ్డి, రంగాల కృష్ణారెడ్డి, ఆల్ ఇండియా కళా రంగం శ్రీకాకుళం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చలపరాయి రవికుమార్, వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

సిఎం పర్యటన విజయవంతం

ప్రజాశక్తి- పలాస

పలాసలో 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రం, రూ.700 కోట్లు వ్యయంతో నిర్మాణం చేపట్టిన వైఎస్ఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించేందుకు వచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికి బహిరంగ సభ విజయవంతం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం పర్యటనకు అనుకున్న దానికంటే ఎక్కువమంది వచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, మెప్మా ఆర్‌పిలు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

మెళియాపుట్టి : నినాదాలు చేస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

స్థానిక తపాలా శాఖ కార్యాలయం వద్ద రెండవరోజు శుక్రవారం జిడిఎస్ సిబ్బంది సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో బాలకృష్ణ, ఈశ్వరరావు, సురంగో, రోహిణి, లక్ష్మి, ఎస్.ఎం. పట్నాయక్, శ్రీను, ధర్మారావు తదితరులున్నారు.

పలాస : పోస్టల్ ఉద్యోగుల నిరవదిక సమ్మె యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.నందికేశ్వరరావు అధ్యక్షతన కాశీబుగ్గ పోస్టాఫీసు ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రకాశరావు, యరన్ కుమార్, సురేష్, సింహాచలం, చరణ్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వంటవార్పు చేస్తూ స్థానిక పోస్టల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. నిరసన కార్యక్రమంలో కోటబొమ్మాళి పోస్టల్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు, గ్రామీణ డాక్ సేవక్‌లు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన తపాలా ఉద్యోగులు సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు ర్యాలీలో భాగంగా తపాలా కార్యాలయం వద్దకు చేరుకొని తపాలా ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు బైరి కష్ణమూర్తి, అంగన్వాడి నాయకులు పి. భూలక్ష్మి, పంచాది లతాదేవి, మొదలవలస లత, పాణిగ్రాహి, బిఎల్.కె నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: దేశవ్యాప్తంగా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న తపాలా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో తపాలా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు: మండల సబ్ పోస్టల్ కార్యాలయంతో పాటు హిరమండలం, నివగాం పోస్టల్ కార్యాలయ వద్ద ఎస్ఒలు వి.ఢిల్లీశ్వరరావు, జగదీశ్వర్‌లు ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె నిర్వహించారు.

...మ్మాళి : వంటావార్పు చేస్తున్న పోస్టల్ సిబ్బంది

కొత్తూరు : సబ్ పోస్టాఫీస్ వద్ద నిరసన చేస్తున్న ఉద్యోగులు

మీ ప్రమేయం ఏమీ లేదు

పలాస ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన బాబూరావు

పలాస: సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రం, రూ. 700 కోట్లు వ్యయంతో నిర్మించిన సుజల స్రవంతి పథకం ఏర్పాటులో సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రమేయం ఏమీ లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. పలాస ప్రభుత్వ ఆస్పత్రిని టిడిపి, జనసేన నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో సుజలధార పథకం క్రింద రూ. 1900 కోట్లు మంజూరు చేస్తే మొదటి విడతగా ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని, ఆయా ప్రాంతాలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ. 468 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కిడ్నీ వ్యాధులతో ప్రజలు బాధలు పడుతున్నారని, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తే 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కిడ్నీ ఆస్పత్రి ఏర్పాటుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కిడ్నీ ఆస్పత్రి నిర్మాణం కోసం 4.50 ఎకరాల స్థలాన్ని కేటాయించింది అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ అని సిఎం, మంత్రి సీదిరి అప్పలరాజులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్ రావు, కామేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు లక్ష్మణ కుమార్, సంతోష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రూ.20 లక్షల స్థలం వితరణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గోవిందపురంలో అయ్యప్ప దేవాలయానికి వరదా కమలాకర్ రూ.20 లక్షల స్థలం వితరణ చేశారు. శుక్రవారం అయ్యప్ప దేవాలయంను సందర్శించి దేవాలయం వెనుక భాగంలో ఉన్న సుమారు రూ.20 లక్షలు విలువ చేసే 214 గజాల సొంత స్థలాన్ని అయ్యప్ప దేవాలయ అవసరాల కోసం ఉచితంగా ఇచ్చారు. ఈ స్థలాన్ని ఆలయ అర్చకులకు నివాస గృహం, దేవాలయ వంటశాలకు వినియోగిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కమలాకర్, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, వేణు పంతులు, గోపి, లావేటి శంకర్, విఘ్నేష్, గణేష్, రాజారావు, గురుస్వామి, దశరద గురు స్వామి, సంతోష్, సన్నిధానం స్వాములు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బెండి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సిఎం జగన్మోహన్ రెడ్డి నిధులు కేటాయింపుపై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సీతాపురంలో సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు అధ్యక్షతన రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వంశధార శివారు ప్రాంత రైతులు పడుతున్న కష్టాలు బెండిగెడ్డ నీరు వృథా కాకుండా ఎత్తి పోతల నిర్మించాలని మంత్రి అప్పలరాజు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో సిఎం సానుకూలంగా స్పందించి పలాస బహిరంగ సభలో బెండి ఎత్తిపోతల పథకం కోసం రూ.7 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు చేపడతామని చెప్పడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయన్నారు. ఈ పథకం కార్యరూపం దాలిస్తే బెండి, సీతాపురం, బొడ్డపాడు, కొండవురు తదితర గ్రామాల్లో సుమారు 1200 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రైతులందరూ మంత్రి అప్పలరాజు కృషిని అభినందించారు. ఈ సమావేశంలో రైతులు యదల్ల రాజారావు, రామయ్య, అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ ఢిల్లీరావు

అటల్ పెన్షన్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న రాజబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అటల్ పెన్షన్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బిసి) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఇ.రాజబాబు పిలుపునిచ్చారు. ఎస్ఎల్‌బిసి, పిఎఫ్ఆర్‌డిఎ సంయుక్తంగా అంబేద్కర్ ఆడిటోరియంలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. లీడ్ బ్యాంకు మేనేజరు సూర్యకిరణ్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, 60 ఏళ్ల తర్వాత రూ.వెయ్యి నుంచి రూ.ఐదు వేల వరకు పెన్షన్ పొందవచ్చన్నారు. దీంతో పాటు రూ. రెండు లక్షల ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. ఈ పథకంలో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 28 లక్షల మంది ఖాతాదారులున్నట్లు తెలిపారు. ఎఫ్ఆర్‌డిఎ అసిస్టెంట్ మేనేజర్ ఈశ్వర్‌దత్ నిర్మల్ మాట్లాడుతూ పెన్షన్ అవసరాన్ని వివరించారు. స్టేట్ కంట్రోలర్ పిఎస్‌యు డిజిఎం దేవీలాల్ మెహ్రా మాట్లాడుతూ 2015లో ప్రారంభించిన ఈ పథకంతో ఆర్థిక భద్రత లభిస్తుందన్నారు. యూనియన్ బ్యాంక్ ఆర్‌డిఎం వెంకట్ తిలక్, మెప్మా, డిఆర్‌డిఎ పీడీలు కిరణ్ కుమార్, విద్యాసాగర్, ఎస్ఎల్‌బిసి చీఫ్ మేనేజర్ గౌతం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే సైన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే సైన్సుపై అవగాహన పెంచుకోవాలని ఎంఇఒలు సంపతిరావు అప్పలరాజు, ఎల్‌వి. ప్రతాప్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల సైన్సు ఎగ్జిబిషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన చేసిన మూడు పాఠశాలలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అయితే ప్రథమ స్థానం లఖందిడ్డి, ద్వితీయ స్థానం కురుడు, తృతీయ స్థానం కోటబొమ్మాళి జిల్లా పరిషత్ పాఠశాలలు సాధించిగా, మొదటి రెండు స్థానాల్లో గెలుపొందిన వారు ఈనెల 20వ తేదీన శ్రీకాకుళం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు హజరు కావాలని ఆర్.విజయలక్ష్మి విద్యార్థులను సూచించారు. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు బి. యర్రన్నాయుడు, కె. ఆనందరావు, సోమ శేఖర్, హైమావతి, అరుణకుమార్, సామ సంజీవరావు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు వర్థంతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

దివంగత పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని రామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి.రామరాజు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శుక్రవారం కోసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనకై 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరజీవిగా ఆంధ్రుల హృదయాల్లో మిగిలిపోయారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలాన వ్యాస గీత, పూర్ణచంద్రరావు, అట్ల రవికుమార్, రాజశేఖర్, సింహాచలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న రామరాజు తదితరులు

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరు పాల్గొనాలని ఉద్దానం అభ్యుదయ సేవాసమితి అధ్యక్షుడు తామడ లక్ష్మణరావు కోరారు. సమితి మొదటి వార్షికోత్సవం సందర్భంగా కొమరల్తాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది కాలంలో సేవా సమితి తరుపున అభాగ్యులకు ఆర్థికసాయం అందించామని తెలిపారు. సేవా కార్యక్రమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా చాలా మంది తమ సహాయ, సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కొమరాల్తాడ గ్రా మంలో సభ్యులతో కలిసి 30 మొక్కలు నాటారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు మండల మహేష్, కొంకి మోహిణి, జి.ఉమ, పాపారావు, శ్రీను పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విజయవంతంగా జరిగింది. డోంకుర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కె.కృష్ణవేణి, గ్రూప్ విభాగంలో కోలిగాం జెడ్‌పి స్కూల్, టీచర్ విభాగంలో బాలికోన్నత పాటశాల ఎం.ఈశ్వరి విజేతలుగా న్యాయనిర్ణేతలు నిర్ధారించారు. వీరు 20న శ్రీకాకుళంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని మండల విద్యాశాఖాధికారి కురమాన అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాటశాల ప్రధానోపాధ్యాయులు. ఎన్.విశ్వనాధం, కామరాజు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల అధ్యాపకులు బి.శంకర్ ప్రసాద్, బి. సురేసుకుమార్, డి.జనార్ధనరావు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఇఒ తదితరులు

కొండను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ

గ్రానైట్ లీజును రద్దు చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని జలక లింగపురం గ్రామ సమీపంలో ఇంజాద్రి గ్రామదేవత కొండపై అక్రమ గ్రానైట్ లీజును ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని మాజీ శాసనసభ్యులు కలమట వెంకటరమణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇంజాద్రి కొండ ప్రదేశాన్ని పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామదేవత ఉన్న ప్రదేశానికి గ్రానైట్ అనుమతి ఇస్తే ఊరుకునేది లేదని, దీనివలన స్థానికులు ఇబ్బందులు పడడంతో పాటు పంట నష్టం, తాగునీటి ఇబ్బందులు తప్పవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రవ్వల గణపతిరావు, పెద్ద పద్మాపురం సర్పంచ్ ప్రతినిధి మాలతి, మాజీ సర్పంచ్ లుకలాపు భాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఉర్లన వసంత్, జనసేన నాయకులు దుక్క బాలరాజు, దుర్గారావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజ్‌పై హర్షం

ప్రజాశక్తి- పలాస

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల పలాస ఎపిఎన్‌జిఒల సంఘం అధ్యక్షులు బోనెల గోపాలరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి ఎం.టి కృష్ణబాబును మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేతులమీదుగా ఈ నెల 14న ప్రారంభించిన పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో పార్మాసిస్టు పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బెందాళం శివప్రసాద్, టి.బాలకృష్ణ, సిహెచ్.విజయకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాంప్రసాద్ తదితరులు

పథకాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

అనిశ్చిత సమాజంలో జీవితబీమా అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని ఎల్‌ఐసి నరసన్నపేట సీనియర్ బ్రాంచి మేనేజర్ ఎం.నేతాజీ అన్నారు. జీవితానికి రక్షణ కల్పించడం కోసం ఎల్‌ఐసి. ప్రజలకు ఎంతో సహాయం చేస్తోందన్నారు. జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. జీవితానికి రక్షణ సామాజిక భద్రతే ధ్యేయంగా సంస్థ పనిచేస్తోందని, తాము చేపడుతున్న కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ వావిలపల్లి నారాయణస్వామి సూచనలతో విద్యార్థులకు ఒకరోజు కార్యక్రమం నిర్వహించామని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి పేర్కొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆశ్రా ప్రతినిధులు

ఆశ్రా అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆశ్రా) ఆధ్వర్యంలో బలగ మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. తూనికలు, కొలతల శాఖ సహాయ కంట్రోలర్ విశ్వేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ రాజా రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాకర్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఇందిరా ప్రసాద్ వినియోగదారుల చట్టం ఆవశ్యకత వివరించారు. ఆశ్రా జిల్లా అధ్యక్షులు గంజి ఎజ్రా వినియోగదారుల హక్కులు భాద్యతలు, మోసాల నివారణ అప్రమత్తతపై అవగాహన కల్పించారు. ఆశ్రా ప్రతినిధులు కె.పార్థసారథి, ఎల్.రవికుమార్, హైస్కూల్ హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20 తరువాత నిరవధిక సమ్మె చేస్తామని కార్మిక సంఘం నేత రమేశ్ కుమార్ పట్నాయక్ మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు సమ్మె నోటీసు అందించారు. మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులకు సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం తదితర డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడంతో సమ్మెకు సంబంధించిన నోటీసును కమిషనర్‌కు అందించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.